

సెంటు స్థలం ఇచ్చి.. ఎలక్షన్ స్టంట్ చేశారు



హౌసింగ్ అధికారులతో కలిసి కొమరగిరి లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

- కొమరగిరి ఇళ్లస్థలాల్లో ద్వారంపూడి భారీ అవినీతి
- భూముల కొనుగోలు, ల్యాండ్ ఫిల్లింగ్‌పై విచారణ చేయించి ద్వారంపూడిపై చర్యలు తీసుకుంటాం
- కాకినాడ సిటీ ఎమ్మెల్యే విజేత కొండబాబు

కాకినాడ సిటీ, జూన్ 17: కొమరగిరి లేఅవుట్‌లో సెంటు స్థలమిచ్చి ఎలక్షన్ స్టంట్ చేశారని, ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించే వైసీపీకి ఓట్లు వేయలేదని కాకినాడ సిటీ విజేత ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కాకినాడ అర్బన్ ప్రాంత పేదలకు కొమరగిరిలో ఇచ్చిన లే అవుట్‌ను సోమవారం హౌసింగ్ అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఎన్ని ఇళ్లు పునాదుల దశలో నిలిచిపోయాయి, ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి వంటి విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌లో ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3లో ఇళ్లనిర్మాణ దశను పరిశీలించారు. లేఅవుట్ కాపీని ఎక్కడెక్కడ ఏ నిర్మాణాలు చేపడతారో వివరాలు అడిగారు. 350 ఎకరాల్లో 16,500 పట్టాలు ఇవ్వగా 8వేలమంది పునాదులు వేయగా మరో 8వేల మందికిపైగా పునాదులు వేయలేదని, 250 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ నాలుగేళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం గమనించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అక్కడ నివాసం ఉంటున్న కుటుంబాల వారు కొండబాబు వద్దకు వచ్చి తాగడానికి నీళ్లు లేవని, లైట్లు సరిగా వెలగడం లేదని మొరపెట్టుకున్నారు. దీనిపై కొండబాబు అక్కడినుంచే కమిషనర్‌కు ఫోన్ చేసి రెండుపూటలా ట్యాంకర్ల ద్వారా మంచినీరు పంపాలని సూచించారు. పూర్తిస్థాయిలో లైట్లు వెలిగేలా ఇక్కడకు వచ్చి పెన్షన్‌లు, రేషన్ ఇచ్చేలా అధికారులతో మాట్లాడారు.

'కొమరగిరి ఇళ్లస్థలాల్లో ద్వారంపూడి భారీ అవినీతి'

అనంతరం కాకినాడ సిటీ ఎమ్మెల్యే విజేత కొండబాబు మీడియాతో మాట్లాడుతూ కొమరగిరి ఇళ్లస్థలాల్లో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి భారీ అవినీతికి పాల్పడ్డాడని, ఈ భూముల కొనుగోలు, ల్యాండ్ ఫిల్లింగ్‌పై విచారణ చేయించి ప్రభుత్వ సొమ్ము కాజేసిన ద్వారంపూడిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాలుగేళ్లలో ఆయన కొమరగిరి లేఅవుట్‌లో కనీస మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదని, టీడీపీ నాయకులు, జనసేన నాయకులపై కేసులు పెట్టించడం, బూతులు తిట్టడం తప్ప ద్వారంపూడి పరిపాలన చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వ సొమ్మును దోచుకోవడానికి కాకినాడ నగరానికి 16 కిలోమీటర్ల దూరంలో సముద్ర తీర ప్రాంతం కొమరగిరిలో 350 ఎకరాలు భూములు కొనుగోలు చేయించాడని, లబ్ధిదారులతో బలవంతంగా బేస్‌మెంట్‌లు వేయించి పేదలను ద్వారంపూడి నట్టేట ముంచాడని అన్నారు. ఈ లే అవుట్‌కు సమీపంలో సాగరమాల ప్రాజెక్టు బైపాస్ రోడ్డు కోసం రైతులనుంచి ఎకరం భూమి రూ.27లక్షల చొప్పున గత ప్రభుత్వం కొనుగోలు చేస్తే, అక్కడ అదే ప్రాంతంలోని కొమరగిరి భూమి ఎకరం రూ.46లక్షలనుంచి రూ.51లక్షలకు కొనుగోలు చేయించి ద్వారంపూడి రూ.వందల కోట్లు కాజేశాడన్నారు. ల్యాండ్ ఫిల్లింగ్ పేరుతో రూ.66కోట్ల ప్రభుత్వ సొమ్ము దోచుకున్నాడన్నారు. కొమరగిరి భూముల కొనుగోలు, ల్యాండ్ ఫిల్లింగ్‌లో జరిగిన అవినీతిపై పూర్తి సాక్ష్యాధారాలతో నివేదికను ప్రభుత్వానికి అందజేసి ప్రభుత్వ సొమ్ము కాజేసిన ద్వారంపూడిపై చర్యలు చేపట్టి పైసాతో సహా వసూలు చేస్తామని వెల్లడించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మిస్తే వాటిని అందజేయకుండా నిరుపయోగంగా ఉంచారన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, వొమ్మి బాలాజీ పాల్గొన్నారు.

పోలవరం చూసి.. కలవరం



దయాఫ్రం వాల్‌ను పరిశీలిస్తున్న బాబు

వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్టు పరిశీలిస్తున్న చంద్రబాబు

- పోలవరాన చంద్రబాబు పర్యటన
- గంటన్నర సేపు అణువణువు పరిశీలన
- ఎండలోనే కలియతిరిగిన వైనం
- నిర్మాణంపై అధికారుల నుంచి ఆరా
- ప్రాజెక్టు ప్రాంతం చూసి ఆవేదన
- జగన్ పాలనలో ధ్వంసం
- మళ్లీ మొదటికొచ్చిందని బాధ
- ప్రాజెక్టు మరమ్మతులపై దృష్టి

రాజమహేంద్రవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కళ తప్పిన పోలవరం ప్రాజెక్టు పనులు చూసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివ్వెరపోయారు. 2019కు ముందు సీఎంగా చంద్రబాబు వచ్చినప్పుడు నిత్యం పనులు జరుగుతుండేవి.. ప్రాజెక్టు ప్రాంతం యంత్రాలు.. భారీ వాహనాలతో కళకళలాడేది.. ఎటు చూసినా వేలాది మంది కార్మికులు పని చేసేవారు. ప్రాజెక్టు చూడడానికి వేలాదిగా ప్రజలు వచ్చేవారు.. నాడు పోలవరం ప్రాజెక్టు ఒక పర్యాటక ప్రాంతంగా మారిందనడంలో ఎంత మాత్రం అతిశయోక్తిలేదు. ప్రతి ఒక్కరి నోటా పోలవరం ఎంత వరకూ వచ్చిందో అనే మాట వినిపించేది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇది ధ్వంసమైంది. యంత్రాలు లేవు. ఏదో కొద్ది లారీలతో ఇసుక తరలింపు తప్ప ఇంకేమీ పనులు సాగకపోవడంతో సీఎం చంద్రబాబు నాయుడు ఆశ్చర్యపోయారు..నా మానసపుత్రిక పోలవరం ఇలా ఉందేమిటో అని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలస్థితిలో ఉన్న ప్రాజెక్టును చూసి నివ్వెరపోయారు.



పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, మాజీ మంత్రి జవహర్ తదితరులు

అణువణువు పరిశీలన..

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు తొలిపర్యటనగా పోలవరం సందర్శించారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు హయాంలో సోమవారం..పోలవారం.. అంటూ ప్రతి వారం పర్యటిస్తూ పనులు పరుగులు పెట్టించారు. ఆ తరువాత 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలవడంతో వైసీపీ చేతిక పగ్గాలు వచ్చాయి. అయితే జగన్ మాత్రం పోలవరం ప్రాజెక్టుపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో 72 శాతం పనులు పూర్తవ్వగా నేడు అదే స్థితిలో ఉండడం గమనార్హం. ఇదిలా ఉండగా మళ్లీ చంద్రబాబు నాయుడు సీఎం కావడంతో సోమవారం.. పోలవారంగా మార్చారు. అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి నేరుగా కార్వాన్ బస్‌లో స్పిల్‌వే మీదకు వచ్చారు. స్పిల్‌వే బ్లాక్ 26వ వద్ద పనుల ప్రగతిపై అధికారులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ పరిశీలించారు. ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరావు, ఇతర అధికారులు అక్కడి పరిస్థితిని వివరించారు. చంద్రబాబు అధికారులను కొన్ని ప్రశ్నలు వేయడంతో పాటు కొన్ని సూచనలు చేశారు. ఎగ్జిబిషన్‌లో ఫొటోలను పరిశీలించి ఆరా తీశారు. ఒంటి గంటకు గైడ్‌బండ్ గ్యాప్-3, యుఎస్‌సీడీ, గ్యాప్ -1,2, డీఎస్‌ఈడీ వద్ద బస్ దిగి పరిశీలించి, ఇరిగేషన్ ఇంజనీర్ల నుంచి పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఎగువ కాఫర్‌డ్యామ్‌కు చేరుకుని సీపేజీల గురించి ప్రశ్నించారు. పవర్‌హౌస్ దిగువ భాగం నుంచి డయాఫ్రంవాల్ నిర్మించిన ప్రధాన డ్యామ్ ఈసీఆర్‌ఎఫ్ నిర్మించే ప్రాంతానికి చేరుకుని అక్కడ పరిస్థితిని పరిశీలించారు. అధిక వర్షాలకు నాలుగుచోట్ల దెబ్బతిన్నట్టు అధికారులు వివరించారు. అక్కడ దిగువ కాఫర్ సమీపంలోకి వచ్చి వాటిని పరిశీలించి పవర్ హౌస్ పనులు చూసి సుమారు 2 గంటల ప్రాంతానికి తిరిగి పోలవరం స్పిల్‌వే ఎగువభాగంలో ఉన్న గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఆయన వెంట ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రులు కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్,ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ, పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, చిర్రి బాలరాజు, బడేటి చంటి, ఏలూరు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జేసీ బి.లావణ్య, ఆర్డీవో అద్దయ్య తదితరులు ఉన్నారు.

పోలవరాన్ని జగన్ ధ్వంసం చేశాడు : చంద్రబాబు

పోలవరం జీవనాడి.. దీనిని జగన్ ధ్వంసం చేశాడన్నారు. తాను 72శాతం పూర్తి చేసిన ప్రాజెక్టును ఎన్ని విధాలా సంక్లిష్టం చేయవచ్చో అన్ని విధాలా చేసి పనికి రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ మాదిరిగా ఏజన్సీని మార్చేయడం, కమిటీలు వేసి తప్పులు వెతకడం కంటే ముందు ప్రాజెక్టును ఎలా పూర్తి చేయాలనేది ముఖ్యమన్నారు. జగన్‌కు అవగాహనలేక, మూర్ఖంగా ఉండడం వల్ల గతంలో ఏజెన్సీని మార్చడంతో పాటు రివర్స్ టెండర్ అంటూ ప్రాజెక్టును పనికి రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది చైనాలోని త్రీగోర్జెస్ కన్నా అధిక స్థాయిలో నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉందన్నారు. ఇక్కడ 194 టీఎంసీల నీరు నిల్వ చేయవచ్చని, 320 టీఎంసీల వరకూ వరదనీటిని వినియోగించుకోవచ్చన్నారు. తమ హయాంలో రూ.446 కోట్లతో డయా ఫ్రంవాల్‌ను నిర్మించామని కానీ 2019, 20లో భారీ వర్షాల కారణంగా నాలుగు చోట్ల దెబ్బతిందన్నారు. దీని మరమ్మతులకు రూ.447 కోట్లు ఖర్చవుతుందని.. పూర్తిగా మరమ్మతులు అవుతాయనే భరోసా లేదన్నారు. ప్రత్యామ్నాయంగా డయాఫ్రంవాల్ నిర్మించడానికి రూ.996 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేసినట్టు చెప్పారు.దీనికి కనీసం నాలుగు సీజన్లు పడుతుందని, 2022కే పూర్తి కావలసిన ప్రాజెక్టు మరింత అలస్యమవుతుందన్నారు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి రాష్ట్రాన్ని పాలించడం రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. ఇవన్నీ చూసి అర్థం చేసుకున్నానని ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.

పోలవరం ఇక వేగవంతం : దుర్గేష్

నిడదవోలు, జూన్ 17: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారాన్ని పోలవారంగా మార్చుకున్నారని గతంలో కూడా సోమవారం పోలవారంగా మార్చుకుని ప్రాజెక్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేశారని..అయితే గత ముఖ్యమంత్రి శుక్రవారాన్ని తన వారంగా మార్చుకున్నారని ఇది ఎందుకో అందరికి తెలిసిందే అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు చేసి మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌ల సంయుక్త కృషితో పోలవరం ప్రాజెక్ట్ త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తారన్నారు.



బాబుకు దుర్గేష్, బత్తుల స్వాగతం



పాపికొండల ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి వస్తున్న చంద్రబాబు కాన్వాయ్

ఎన్నాళ్లీ కడలి కోత



ఉప్పాడ సముద్ర తీరంలో జియోట్యూబ్ కొట్టుకుపోవడంతో కోతకు గురైన తీరప్రాంత మత్స్యకారుల ఇల్లు(ఫైల్‌ఫొటో)

- ఉప్పాడ తీరప్రాంతంలో సముద్ర కోతకు గురవుతున్న మత్స్యకారుల ఇళ్లు
- కొట్టుకుపోతున్న బీచ్ రోడ్డు
- శాశ్వత రక్షణకు చర్యలు తీసుకోవాలంటున్న తీరప్రాంత వాసులు

ఉప్పాడ(కొత్తపల్లి), జూన్ 17: ప్రకృతి వైపరీత్యాలు, తుఫాన్‌లు అల్పపీడనాలు సంభవించినప్పుడల్లా ఉప్పాడ తీరప్రాంతం కెరటాల ధాటికి విలవిలాడుతోంది. 1960 సంవత్సరానికి పూర్వం ఉప్పాడ సముద్రపు ఒడ్డుకు రెండు కిలోమీటర్లు దూరంలో ఉండేదని పెద్దలు చెప్తుంటారు. అప్పటినుంచి ఇప్పటికి సముద్రం రెండు కిలోమీటర్లు ముందుకు వచ్చిందని అంటుంటారు. అప్పట్లో ఉప్పాడకు చెందిన 900 ఎకరాల పంటభూమి, మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, రెండు జడ్పీ అతిథిగృహాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఖరీదైన బంగ్లాలు కూడా కడలిలో కలిసిపోయాయి. ఇవన్నీ 64ఏళ్ల కిందట జరిగిన చరిత్రగా మత్స్యకార పెద్దలు చెప్తున్నారు. గతంలో తుని నుంచి ఉప్పాడ బీచ్ మీదుగా కాకినాడ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు నిర్మించిన తర్వాత 1996, నవంబరు, డిసెంబరు నెలల్లో సంభవించిన భారీ తుఫాన్‌లకు బీచ్‌రోడ్డు కెరటాల ధాటికి ధ్వంసమైంది. ఉప్పాడ శివారు కొత్తపట్నం నుంచి విద్యుత్ ప్లాంటు సమీపం వరకు 4 కిలోమీటర్ల రోడ్డు, రెండు వంతెనలు కెరటాల ఉధృతికి తునాతున కలైంది. వీటితో సముద్రం ఒడ్డున నివాసం ఉండే వందలాదిమంది మత్స్య కారుల ఇళ్లు కూడా సముద్ర గర్భంలో కలిసిపోయాయి. సముద్రకోతనుంచి రక్షణ కల్పించేందుకు మాయాపట్నంనుంచి కొత్తపట్నం వరకు అప్పట్లో రూ.12కోట్లతో డ్రెయిన్లు, భూగర్భగనులశాఖ ఆధ్వర్యంలో జియోట్యూబ్ నిర్మాణం చేపట్టారు. ఈటెక్నాలజీతో తీరం పటిష్టం చేసిన తర్వాత ఎన్నో తుఫాన్‌లు సంభవించినా మత్స్యకారులు ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కాదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జియోట్యూబ్ టెక్నాలజీకి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రతిరోజూ సముద్రంలో ఏర్పడే పోటు,పాట్లకు నైలాన్ తాళ్లు తెగి బండరాళ్లు అలల తాకిడి సముద్రంలో కలిసిపోతున్నాయి. దీంతో మాయాపట్నం, సూరాడపేట, రామిశెట్టిపేటల్లో అనేకమంది మత్స్యకారులు ఇళ్లు కొట్టుకుపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

మంత్రి పవన్‌కళ్యాణ్ సమస్య పరిష్కరిస్తారా?

దశాబ్దాలకాలంగా సముద్రం ఉప్పాడ గ్రామాన్ని, బీచ్‌రోడ్డును కబళించేస్తున్నా పాలకులు శాశ్వత రక్షణ చర్యలు చేపట్టడంలేదని మత్స్యకారులు వాపోతున్నారు. హామీలైతే ఇస్తున్నారు కానీ శాశ్వతంగా కోత నివారణకు ఎప్పుడు చర్యలు చేపడతారో కచ్చితంగా చెప్పడం లేదని తీరప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఎన్నికల ప్రచారంలో భాగంగా పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన కొణిదల పవన్‌కళ్యాణ్ కోత నివారణకు శాశ్వతంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆయన భారీమెజార్టీతో గెలిచి మంత్రి కూడా అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన తమ సమస్యకు పరిష్కారం చూపి మాట నిలబెట్టుకోవాలని తీరప్రాంత మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్యాగాలకు ప్రతీక.. బక్రీద్



బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

మండలాలవారీగా వర్షపాతం వివరాలు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 17: జిల్లాలో సోమవారం అక్కడక్కడా వర్షం కురిసింది. అత్యధిక వర్షపాతం కాకినాడ రూరల్‌లో 54.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఈ మేరకు కలెక్టరేట్‌నుంచి మండలాలవారీగా వివరాలను ఒక ప్రకటనలో తెలియజేశారు. సామర్లకోటలో 19.2 మి.మీ, ఏలేశ్వరం 13.4 మి.మీ, శంఖవరం 7.6 మి.మీ, గండేపల్లి 7.4 మి.మీ, జగ్గంపేట 7.2 మి.మీ, పెద్దాపురం 6.2 మి.మీ, యు.కొత్తపల్లి 5.2 మి.మీ, కాకినాడ సిటీ 3.4 మి.మీ, రౌతులపూడి 2.4 మి.మీ, గొల్లప్రోలు 1.0 మి.మీగా నమోదైంది.

రెంటికీ చెడ్డ రేవడిలా..

- ఘోరంగా మారిన వైసీపీ శ్రేణుల పరిస్థితి
- పార్టీ ఓటమి ఒకవైపు, బెట్టింగ్ ఓటమి మరోవైపు
- కోట్లలో నష్టపోయిన వైనం.. కోలుకోలేని నష్టం
- అన్నింటికీ మించి భారీగా అవమానం



తుని రూరల్, జూన్ 17: వైసీపీ నాయకులు, పార్టీ శ్రేణుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. ఒకపక్క పార్టీ ఓటమి, బెట్టింగ్ ఓటమి. దీంతో కోట్లలో నష్టపోయిన నాయకులు, కార్యకర్తలకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇదే సందర్భంలో మరోపక్క భారీగా అవమానం. ఇది ప్రస్తుతం జిల్లాలో వైసీపీ నాయకులు, పార్టీ శ్రేణుల పరిస్థితి. ఎక్కడ చూసినా, ఏ నలుగురు కలిసినా ఒక్కటే చర్చ. అసలు వైసీపీ ఎలా ఓడిపోయింది. ఓడిపోవడం సహజం. ఇంత ఘోరంగా ఓడిపోవడం అంటే ఎలా అనేది అర్థం కాని పరిస్థితి. ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఉందని వైసీపీ నాయకులు, శ్రేణులు గుర్తించలేకపోయారు. కేవలం ప్రభుత్వ వ్యతిరేకతే కాదు. ప్రజల్లో వైసీపీ నాయకుల వ్యవహార తీరు. అంతులేని అవినీతి. కార్యక్రమాలు ఓటమిపై తీవ్ర ప్రభావం చూపడం ప్రధాన కారణమనే అభిప్రాయం ప్రతిఒక్కరినుంచి వ్యక్తమవుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బెట్టింగులతో కూడా జిల్లాలో కూడా పెద్దఎత్తున బెట్టింగ్‌లు జరిగాయి. జిల్లాలో వందల కోట్లకు పైగా బెట్టింగ్‌లు జరిగినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. వాస్తవంగా అంతమొత్తంలో జరిగిందో లేదో కానీ, బెట్టింగ్‌లు అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా జరిగాయనేది వాస్తవం.

రూ.లక్షల్లో భారీగా బెట్టింగ్‌లు

ప్రధానంగా పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీతో అక్కడ గెలుపు మెజార్టీలతో రాష్ట్రవ్యాప్త వైసీపీ, కూటమి శ్రేణుల మధ్య పెద్దఎత్తున బెట్టింగ్‌లు జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో రూ.10వేలు మొదలుకొని రూ.50లక్షల వరకు బెట్టింగ్‌లు జరిగినట్లు అందరి నోట చర్చ జరుగుతోంది. గ్రామాలవారీ, బూత్‌ల వారీ బెట్టింగ్‌లు జరిగినట్లు సమాచారం. ఇలా వందలాది మంది లక్షలాది రూపాయలు పందేలు కాసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు కోట్లలో డబ్బులు నష్టపోయినట్లు తెలుస్తోంది. సామాన్య కార్యకర్తలు మొదలు జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు సైతం జిల్లాలో పందేలు కాసి నష్టపోయినట్లు సర్వత్రా చర్చ జరుగుతోంది. కొన్నిచోట్ల నగదు రూపంలో కాకుండా స్థిరాస్తి రూపంలో కూడా పందేలు కాసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అప్పటి మంత్రిగా వైసీపీ నుంచి బరిలో దిగిన దాడిశెట్టి రాజా, కూటమి తరుపున బరిలో దిగిన యనమల దివ్య మధ్య ఉత్కంఠ పోటీ నెలకొనడంతో నియోజకవర్గంలో మాజీమంత్రి గెలుపుపై పెద్దఎత్తున పందేలు కాశారు. అనూహ్యంగా కూటమి అభ్యర్థి యనమల దివ్య అఖండ మెజార్టీతో దూసుకురావడంతో వైసీపీ మాజీమంత్రి ఓడిపోయారు. దీంతో మాజీమంత్రి అనుచరులతోపాటు ఆ పార్టీ కార్యకర్తలు కోట్లలో పందేలు కాసి తీవ్రంగా నష్టపోయినట్లు తెలుస్తోంది. చాలామంది వైసీపీ మద్దతుదారులు, వైసీపీ శ్రేణులు, పార్టీ ఓడిపోయి ఒకపక్క, బెట్టింగ్ వేసి ఓడిపోయి ఒకపక్క ఇలా రెండువైపులా రెండింటికీ చెడ్డ రేవడిలా బలయ్యారని చర్చ సాగుతోంది.

కల్యాణం.. కమనీయం

వైనతేయ నదీ తీరం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. అప్పనపల్లి బాలబాలాజీస్వామి దివ్య కల్యాణాన్ని పాంచాహ్నిహక దీక్షతో పాంచరాత్ర ఆగమానుసారం జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినాన సోమవారం రాత్రి 8.59 గంటలకు వేద మంత్రోచ్ఛారణల నడుమ అంగరంగ వైభవంగా జరిపించారు.



కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు



కల్యాణ తంతును నిర్వహిస్తున్న పండితులు

మామిడికుదురు, జూన్ 17: చినజీయర్‌స్వామి శిష్యుడు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాస్, అర్చకులు ఎదుర్కోలు సన్నాహంలో భాగంగా స్వామివారి గుణగణాలను వివరించిన తీరు భక్తుల మనసులను రంజింపచేసింది. కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించగా 315 మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణ క్రతువును నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. వారికి దేవస్థానం సిబ్బంది తాగునీరు, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు వీలుగా ఆలయ ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఆలయ సహాయ కమిషనరు గ్రంధి మాధవి పర్యవేక్షణలో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



సీతారామ్

అంబాజీపేట, జూన్ 17: టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లాకు తణుకుకు చెందిన వారణాసి సీతారామ్ (53), అతని భార్య మహాలక్ష్మి, కుమార్తె లాస్యశ్రీ మోటారు సైకిల్‌పై ఈ నెల 16న అమలాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముక్కామల సమీపంలోకి వచ్చేసరికి రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళ్తున్న టిప్పర్ లారీ ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. ముగ్గురికీ తీవ్రగాయాలు కాగా అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సీతారామ్ చికిత్స పొందుతూ మృతి చెందగా మహాలక్ష్మి చికిత్స పొందుతోంది. లాస్యశ్రీ కుడికాలును తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు.

బాలికపై అత్యాచారం

మలికిపురం, జూన్ 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలంలోని ఒక గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికను 55 ఏళ్ల వ్యక్తి అత్యాచారం చేశాడు. తొమ్మిది సంవత్సరాల బాలికపై అదే గ్రామానికి చెందిన 55 సంవత్సరాల వై.సంపదరావు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నెల 12వ తేదీన ఈ సంఘటన జరగ్గా బాలిక తండ్రి ఈ నెల 16న ఆదివారం రాత్రి మలికిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాజోలు సీఐ గోవిందరాజు సోమవారం తెలిపారు. సంఘటనా స్థలాన్ని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ సోమవారం సాయంత్రం పరిశీలించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

పిఠాపురం రూరల్, జూన్ 17: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ సోమవారం వెల్లడించారు. భోగాపురం గ్రామంలోని ఆలయం వద్ద నిద్రిస్తున్న బొమ్మదేవు ప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన నాగులాపల్లి పద్మరాజు నాపరాయితో కొట్టి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు కోసం కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. ప్రసాద్, పద్మరాజులు ఇద్దరు కాకినాడ గాంధీనగర్‌లోని ఒక మేస్త్రి వద్ద 15 రోజులుగా పనిచేస్తున్నారు. 13వ తేదీన చేసిన పనికి సంబంధించి ప్రసాద్ మేస్త్రిని డబ్బులు అడగగా, పద్మరాజు తీసుకు వెళ్లినట్లు చెప్పాడు. దీనిపై అదే రోజు రాత్రి ఇద్దరి మధ్య వివాదం జరిగింది. తనను చంపుతామని బెదిరించడంతో పద్మరాజు అదే రోజు రాత్రి నిద్రిస్తున్న ప్రసాద్‌ను రాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసుల ముందు అంగీకరించాడు. పద్మరాజును బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ప్రయాణికులు సురక్షితం



ఆత్రేయపురం, జూన్ 17: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఒక కుటుంబం కారులో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వచ్చింది. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా లొల్ల-నల్లకాల్వ సమీపంలో కారు ప్రమాదవశాత్తు అదుపు తప్పి పంటకాల్వలోకి దూసుకెళ్లింది. స్థానికులు కారును బయటకు తీశారు. అందులో ఉన్నవారంతా సురక్షితంగా బయటపడ్డారు.

మరో పది డయేరియా కేసులు

- బాధితులను పరామర్శించిన వైద్య శాఖ ఉన్నతాధికారులు
- కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు



పరామర్శిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో నర్సింహనాయక్

తొండంగి,జూన్ 17:తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో సోమవారం మరో 10 డయేరియా కేసులు నమోదయ్యాయి.ఆదివారం కొంత నెమ్మదించినప్పటికి తిరిగి పది కేసులు నమోదు కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నర్సింహనాయక్ గ్రామాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.గత కొద్ది రోజులుగా ఆయన ప్రతి రోజు గ్రామాన్ని సందర్శించి తగిన సూచనలు జారీ చేస్తున్నారు.ఇప్పటి వరకూ సుమారు వంద కేసుల వరకూ నమోదు కావడంతో శాసన.మండలి ప్రతి పక్షనేత యనమల రామకృష్ణుడు,స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్యలు ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసారు.దీంతో జిల్లా అధికారులంతా ప్రతి రోజు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పంచాయితీ అధికారి భారతీ సౌజన్య ,డీఎల్‌పీఓ బాలామణిలు గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి తగిన సూచనలు జారీ చేసారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన పారిశుధ్య సిబ్బంది గ్రామమంతా శుభ్రపరచి బ్లీచింగ్ చల్లి క్రిమి సంహారక మందులు పిచికారీ చేసారు.తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.గ్రామస్థుల సూచన మేరకు వాటర్ పైప్‌లైన్ కు సంబంధించిన గేట్ వాల్వు ఉన్న ప్రాంతంలో సిమ్మెంట్ రహదారి నిర్మించడంతో దానిని పరిశీలించేందుక అక్కడ తవ్వించారు.స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న రోగుల్ని జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్ జిల్లా ఉపవైద్యాధికారి సరితలు పరామర్శించారు.తగు జాగ్రత్తలు తీసుకోవాలని ,కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతిలు వైద్యసేవలు అందిస్తున్నారు.మండల టిడిపి నేత యనమల రాజేష్ మాట్లాడుతూ రోగులంతా ధైర్యంగా ఉండాలన్నారు,యనమల రామకృష్ణుడు జిల్లా అధికారులను రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారని.ప్రభుత్వం అన్ని విధాలా రోగులకు అండగా ఉంటుందన్నారు.ఎవరూ ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు.ఎంపిడిఓ మల్లేశ్వరావు, తదితరులు పారిశుధ్యపనులు పర్యవేక్షించారు.

పలు రకాలుగా మోసాలు

- రూ.కోటికి పైగా కాజేసిన వ్యక్తి?
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఆలమూరు, జూన్ 17: దివ్యాంగుడు..అనగానే ఎదుటివారు జాలి, దయ చూపిస్తారు. కానీ దానినే పెట్టుబడిగా ఈ దివ్యాంగుడు పలువురిని అనేక రకాలుగా బుట్టలో వేసుకుని వారి వద్ద నుంచి రూ.కోటికి పైగా లాగేశాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో జరిగిన ఈ ఘటనలో అనేక విషయాలు బయటపడుతున్నాయి. సదరు దివ్యాంగుడిపై బాధితులు ఆలమూరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.... ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన యర్రంశెట్టి దుర్గారావు అనే దివ్యాంగుడు పెళ్లిళ్ల మధ్యవర్తిగా వ్యవహరిస్తూ అనేక మందిని మోసం చేసిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అతడు తల్లి వెంకయమ్మ, తమ్ముడు మురళి సహాయ సహకారాలతో ఈ నేరాలకు పాల్పడినట్టు బాధితులు చెప్తున్నారు. మూలస్థానం గ్రామానికి చెందిన డి.రాంబాబు కుమారుడికి చాగల్నాడు నుంచి నాలుగు ఎకరాలు కట్నం ఇస్తారని పెళ్లి సంబంధం తీసుకొచ్చాడు. పెళ్లి కుదిర్చేందుకు పావులు కదిపాడు. పెళ్లి కుమార్తె తరపు వారు ఇబ్బందుల్లో ఉన్నారని నమ్మించి పలు దఫాలుగా బంగారంతో పాటు దాదాపు రూ.40 లక్షల వరకు నగదు కాజేసినట్టు బాధితులు వివరించారు. నవాబుపేటలో పాల వ్యాపారం చేసుకునే సురేష్ వద్దకు వచ్చి స్నేహం చేశాడు. కొద్దిరోజుల తర్వాత తన బంగారాన్ని బ్యాంకులో కుదువపెట్టానని, అది వేలానికి వచ్చిందని దుర్గారావు చెప్పాడు. తాను విడిపించుకోలేనని రూ.4.10 లక్షలు చెల్లిస్తే దాదాపు రూ.10 లక్షల విలువ గల బంగారం తీసేసుకోవచ్చని నమ్మబలికి ఆ మొత్తాన్ని తీసుకున్నట్టు బాధితుడు సురేష్ చెప్పాడు. రావులపాలెంలో ఒక ఫైనాన్స్ కంపెనీ యాజమాని వద్ద ఇదే చెప్పి దాదాపు రూ.10 లక్షలు కాజేసిన వ్యవహారం కూడా వెలుగు చూసింది. దుర్గారావు ఆలమూరు, కడియం, రావులపాలెంల్లో అనేక మోసాలకు పాల్పడినట్టు తెలుస్తోంది. అతడిపై ఆలమూరు పోలీస్ స్టేషన్లో ఇప్పటివరకు ఆరు ఫిర్యాదులు అందాయి.

సిలిండర్ పేలి తాటాకు పాక దగ్ధం

రూ. 7 లక్షల ఆస్తి నష్టం



గొల్లప్రోలు రూరల్, జూన్ 17: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి తాటాకుపాక దగ్ధమవడంతో రూ. 7 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన పోలవరపు చంద్రరావు కూలి పని చేసుకుని జీవనం సాగిస్తూ ఉంటారు. సోమవారం పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాన్లతో పాటు 7 కాసుల బంగారం నగలు, చీటి పాడి ఇంటిలో తెచ్చి పెట్టిన నగదు, బీరువాలు, బట్టలు, ఇతర నిత్యావసర వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంతో రోడ్డున పడ్డామని చంద్రరావు, అతని కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. మంటలు పక్కనే ఉన్న షేక్ రాజుబాబు ఇంటికి వ్యాపించడంతో అతని ఇంటికి ఉన్న ఏసీ, గదిలో ఉన్న మంచం, ఇతర సామాన్లు కాలిపోయాయి. ప్రమాదంలో ఆస్తినష్టం రూ.7 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికే స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు మరింతగా వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది చర్యలు చేపట్టారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పదివేల కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం

గొల్లప్రోలు, జూన్ 16: జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖలతో పాటు పర్యావరణ శాఖా మంత్రిగా ఈ నెల 19వ తేదీన బాధ్యతలు స్వీకరిస్తున్న వేళ ఒక జనసేన నేత వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజున ప్రారంభించి పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రాజెక్టు రైజ్ కోకో పేరుతో పదివేల కొబ్బరిమొక్కలు నాటే కార్యక్రమానికి జనసేన నేత మురాలశెట్టి సునీల్‌కుమార్ శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చల్లా లక్ష్మి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, మారిశెట్టి బుజ్జి, బాపన్నదొర, సానా నాగు, కండేపల్లి నూకరాజు, గంధం నాగేంద్ర, రావు రాజేష్ పాల్గొన్నారు.

విజయనగరం ఎంపీ పూజలు



పూజలు చేస్తున్న అప్పలనాయుడు

అన్నవరం, జూన్ 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి సోమవారం విజయనగరం ఎంపీగా ఎన్నికైన కలిశెట్టి అప్పలనాయుడు మొక్కులు చెల్లించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తానని అప్పలనాయుడు అనుకున్నారు. అయితే వీటిని సోమవారం తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రులకు ఉపయోగపడే పోలవరం, అమరావతి రాజధాని చంద్రబాబు హయాంలో త్వరితగతిన పూర్తికావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో ఎం.గణపతి తదితరులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.

12 కిలోల వాలుగ చేప



కొత్తపేట, జూన్ 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కండ్రిగ గ్రామంలో ఓ రైతుకు పంట చేలో పెద్ద వాలుగ చేప దొరికింది. కండ్రిగకు చెందిన రైతు బొక్కా రామమూర్తి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి చేలో నీరు పెట్టడానికి పొలానికి వెళ్లాడు. తన చేలో పెద్ద చేప అటూఇటూ తిరుగుతుండడం చూసి ఆశ్చర్యానికి గురయ్యాడు. దానిని పట్టుకుని పైకి తీశాడు. సుమారు మూడు అడుగుల పొడవు 12 కిలోల బరువున్న ఈ చేప పంట చేలో దొరకడంపై సమీప రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే పంట కాల్వలో మూడు లేదా నాలుగు కిలోలకు మించి వాలుగులు దొరకవు. ఇంత పెద్ద చేప దొరకడంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు.

అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 17: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి ర్యాలికి చెందిన కోదాటి రవికిశోర్-వెంకటరత్నకుమారి దంపతులు రూ.1,00,008 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.4,51,958 లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.



వ్రతమాచరిస్తున్న భక్తులు

సత్యదేవుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

అన్నవరం, జూన్ 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి సోమవారం భక్తులతో పోటెత్తింది. ఏకాదశి పర్వదినం, బక్రీదు సెలవు దినం కావడంతో ఈ రద్దీ నెలకొంది. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఒక్కరోజు సుమారు 4500 వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.55 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఆలయ అధికారులు వివిధ ఏర్పాట్లు చేశారు.

భీమేశ్వరునికి పూజలు



సామర్లకోట, జూన్ 17: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో 18 రోజుల పాటు భారతీయ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శివలింగ జీర్ణోద్ధారణ ప్రక్రియ పూర్తవడంతో ఏకాదశి సోమవారం తెల్లవారుజాము నుంచి దర్శనాలకు అనుమతించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ తదితరులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు చక్కెరపొంగలి, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు వెయ్యి మందికి అన్నప్రసాదాలను మూడు వేల మందికి మజ్జిగను పంపిణీ చేశారు. ఆలయం వెలుపల గల భీమేశ్వర అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



కరప, జూన్ 17: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన సునంద తేజశ్రీ ఎంపికయ్యింది. కాకినాడలోని అన్నవరం సత్యదేవ మహిళా కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న తేజశ్రీ గత మే 31 నుంచి జూన్ 1వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలవడంలో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ చింతా నారాయణమూర్తిరాజు తెలిపారు. దీంతో సెలక్టర్లు ఆమెను రాష్ట్రజట్టుకు ఎంపికచేశారని, ఈనెల 19 నుంచి 20వ తేదీ వరకు పూణేలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో జరిగే ఆల్ ఇండియా బాలికల రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆడేందుకు సోమవారం బయలుదేరి వెళ్లినట్టు ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తేజశ్రీని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, గురజనాపల్లి హైస్కూల్ పీడీ కర్రి నాగలింగేశ్వరరావు, గ్రామ పెద్దలు అభినందించి జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

సత్యదేవుని నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, జూన్ 17: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన పి. రోజాశ్రీదేవి రూ 1,00,116 విరాళంగా సమర్పించారు. దాత ఈ మొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనం ప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే కొండబాబుకు అభినందనలు

కాకినాడ సిటీ, జూన్ 17: కాకినాడ సిటీ ఎమ్మెల్యే విజేత వనమాడి కొండబాబును సోమవారం స్థానిక జగన్నాథపురంలోని ఆయన నివాసంలో పలువురు అధికారులు, ప్రముఖులు కలిసి అభినందలు తెలిపారు. న్యూ సెంచరీ స్కూల్ అధినేత డాక్టర్ వెంకట్ కొండబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపల్ రిసోర్స్‌పర్సన్‌లు కలిసి అభినందనలు తెలిపారు. అలాగే పలు వార్డుల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీశ్రేణులు వచ్చి కలిశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు
- భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ
- ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



కాకినాడలో ఎమ్మెల్యే కొండబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ముస్లిం సోదరులు



సర్పవరం జంక్షన్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ సిటీ, జూన్ 17: ముస్లిం సోదరులు భక్తి ప్రపత్తులతో నిర్వహించుకునే బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే విజేత వనమాడి కొండబాబు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆయన్ను జగన్నాథపురంలోని సోమవారం ఆయన నివాసంలో ముస్లిం సోదరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కొండబాబు ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మైనారిటీ నాయకులు ఎండీ అన్సర్, రహీమ్ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: మత సామరస్యం, ఐక్యతను పెంపొందిస్తుందని, త్యాగాల ప్రతీక బక్రీద్ పండుగ అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం ఆయన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసం వద్ద ముస్లిం మత పెద్దలు ఇచ్చిన గౌరవవందనాన్ని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో చిన్నారుల నుంచి పెద్దలు దాకా అత్యంత నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు ఆచరించడం ద్వారా త్యాగం, సేవా నిరతిని అందిపుచ్చుకుంటారని కొనియాడారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం పెద్దలు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలో ముస్లిం సోదరులు బక్రీదు పండుగను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించుకున్నారు. స్థానిక పెద్ద మసీదు వీధిలో ఉన్న షాహీ జామియా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ సృష్టికర్త ఆదేశానుసారం తన త్యాగనిరతిని నిరూపించుకున్న ప్రవక్త ఇబ్రహీం అని, ఆయన చూపిన మార్గాన్ని ప్రతీ ముస్లిం తప్పక ఆచరించాలన్నారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, ఉత్తరకంచి, రాయవరంలలోని మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్తిపాడులోని నిరుపేద ముస్లింలకు బక్రీద్‌పండుగ పురస్కరించుకుని పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను నిరుపేదలకు బియ్యం, పండ్లు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతి వెంకటేశ్వరరావు, కందిమళ్ళ శామ్యూల్ తదితరులున్నారు.

సామర్లకోట: పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలోనూ ఈదం ఉల్ అజ్హా నమాజ్‌ను ఈద్గాలో నిర్వహించుకున్నారు. సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. జామా మసీద్ అధ్యక్షులు ఎస్‌ఏ, రెహ్మాన్, మసీద్ ఇమాం ముస్బిబ్ అహ్మద్, ఖురేషీ మసీద్ అధ్యక్షులు రిజ్వానుల్ హక్, ఇమాం ఫెరోజ్ ఆలం, అమీనా, ఎండీ సుభాని, నూరాని జామియా మసీద్ అధ్యక్షులు ఎండీ గౌస్, ఇమాం ముజఫర్, ఎండీ సైపుల్లా, ఎండీ హబీబుల్లా సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘం తరఫున అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ముస్లింసోదరులుకు శుభాకాంక్షలు తెలిపారు.

కల్యాణ్‌కృష్ణ వ్యవహారశైలిపై టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, జూన్ 17: "కాకినాడ రూరల్ జనసేన కూటమి ఎమ్మెల్యేగా తన గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులు విశేష కృషి చేశారు. వారి కుమారుడు కల్యాణ్‌కృష్ణ తల్లిదండ్రులు మాట బేఖాతరు చేసి వైసీపీ అభ్యర్థి కురసాల కన్నబాబుతో అంటకాగుతూ తన ఓటమి కోసం ప్రయత్నాలు చేశాడు. ఇప్పుడు మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో ఫొటో తీయించుకుని టీడీపీ,జనసేన కూటమి ఐక్యతను దెబ్బతీసే రీతిలో మంత్రి ఫొటో పెట్టి కేడర్‌ని తప్పుదారి పట్టిస్తున్నాడు. అతడి వ్యవహారశైలిపై టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తా"అని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. గొడారిగుంటలో సోమవారం టీడీపీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీతో తిరుగుతూ తనను ఓడిస్తానంటూ ఛాలెంజ్ చేశాడని, పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థి తరఫున నగదు పంచడం జరిగిందని విమర్శించారు. మంత్రిని కలసి ఫొటో తీయించుకుని ఆ ఫొటో కాకినాడ రూరల్‌లో పెట్టి ప్రచారం నిర్వహిస్తున్నారని, దీంతో టీడీపీ కేడర్‌కి బాధ కలిగిందన్నారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తనవద్దకు వచ్చి ఈ విషయమై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని కోరారని, కూటమి ఐక్యతను దెబ్బతీసే విధంగా ప్రవర్తించే వారి పై చర్యలు తీసుకోవాలని టీడీపీని కోరడం జరుగుతుందన్నారు. తన గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే పిల్లి దంపతులతో పాటూ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), నులుకుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, పెంకే శ్రీనివాస బాబా వంటి నాయకులు చేసిన కృషితో రికార్డుమెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. కాగా కల్యాణ్‌కృష్ణ తీరును టీడీపీ నాయకులు కాకరపల్లి చలపతిరావు, కౌజు నెహ్రూ, కొండా వినాయక్, దేవు వెంకన్న ఖండించారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. గొడారిగుంటలో పీఆర్‌టీయూ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి నూకరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల ఏడుకొండలు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి బొకేలు ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం విద్యుత్తునగర్‌లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ని మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు నీలం వెంకటేశ్వరరావు, పీఎస్‌వీవీ ప్రసాద్, పాట్నీడి సూర్య నాగేశ్వరరావు, వి.మనోహర్, వాకాడ వెంకటరమణ, మంగారావు, జగ్గారావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, టీఎస్ఎస్ జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలి'

పిఠాపురం, జూన్ 17: వైసీపీ ప్రభుత్వంలో తమకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది రెగ్యులరైజ్ చేయాలని డీఎస్సీ 2008 ఎంపికై మినిమమ్ టైమ్ స్కేల్‌లో నియమితులైన ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 200మందికి పైగా ఉపాధ్యాయులు సోమవారం పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. డీఎస్సీలో ఎంపికైన 2,193 మందిని వైసీపీ ప్రభుత్వం రెగ్యులర్‌గా కాకుండా మినిమమ్ టైం స్కేలులో కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలిచ్చి తమకు తీరని అన్యాయం చేసిందని తెలిపారు. తమను రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని వారు విన్నవించారు. వర్మ స్పందిస్తూ రెగ్యులరైజ్ చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పవన్ గెలుపులో కీలకపాత్ర పోషించిన వర్మను వారు ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ వెలుగు టీచర్స్ ఫెడరేషన వ్యవస్థాపక అధ్యక్షురాలు పిల్లా వెలుగు జ్యోతి, గొల్లప్రోలు మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, అప్పా రాష్ట్ర అధ్యక్షుడు పిల్లా చంద్రం, నాని, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వర్మ పరామర్శ

గొల్లప్రోలు రూరల్, జూన్ 17: గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో అగ్నిప్రమాద బాధితులను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.15వేలు ఆర్థికసహాయంతో బియ్యం, దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేశారు. వారికి ఇళ్లస్థలంతో పాటు పక్కాగృహాన్ని నిర్మాణానికి సహాయం మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరామని వర్మ తెలిపారు. వర్మ వెంట టీడీపీ మండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, కుక్కా మురళీ, నాగేశ్వరరావు, కొలిపే బుల్లబ్బాయి ఉన్నారు. అగ్నిప్రమాద బాధితులను నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు పరామర్శించి రూ.10వేలు సాయం అందజేశారు. నాయకులు డాక్టర్ పిల్లా శ్రీధర్, జ్యోతుల శ్రీనివాస్, వెన్నపు చక్రరావు, మర్రి దొరబాబు, దేవరపల్లి చినబాబు, ఓదూరి నాగేశ్వరరావు ఉన్నారు.

'నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలి'

జగ్గంపేట, జూన్ 17: జగ్గంపేట మండలం గుర్రప్పాలెంలో గత 20 ఏళ్లుగా సీలింగ్ భూమిని సాగుచేసుకుంటున్న నిరుపేదలకు త్వరితగతిన పట్టాలు మంజూరు చేయాలని సోమవారం గుర్రప్పాలెంలో నిరసన ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వ్యవహరించినట్టు ఈ ప్రభుత్వంలో వ్యవహరించకుండా నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని, లేకపోతే మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు స్థానిక ఎమ్మెల్యే స్పందించి నిరుపేదలకు పట్టిలిపిపంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కుంచే అంజిబాబు, ఆర్‌సీఎస్ నాయకులు సురేష్, చిన్న, ఏసురత్నం, భద్రం ఉన్నారు.

'104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

పెద్దాపురం, జూన్ 17: 104లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియచేసి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చాట్ల రాంబాబు, శ్రీకాంత్, త్రిమూర్తులు, వెంట్రావు, శ్రీనివాస్, తేజ, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

కారు ఢీకొని కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

సామర్లకోట, జూన్ 17: సామర్లకోట పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న శంకర్ మోటార్‌సైకిల్‌పై సోమవారం ఉదయం కాకినాడ వెళ్తుండగా వెంకటకృష్ణరాయపురం-మాధవపట్నం గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇదే ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మరో మహిళకు కూడా గాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన ఇద్దరినీ అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ సంఘ నాయకుల సమావేశం

ప్రత్తిపాడు, జూన్ 17: ప్రత్తిపాడులో సోమవారం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఆ సంఘానికి గతంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేసి రాజీనామా చేసిన యల్లపు బుల్లిరాజు సంఘానికి ఇచ్చిన రూ.5లక్షల విరాళాన్ని తిరిగి బుల్లిరాజుకు సంఘ నాయకులు అందజేశారు. నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు మదినే నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఒమ్మి గంగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు యడ్లవీరాస్వామి, మండల నాయకులు నల్లమిల్లి నానాజీ, కోసూరి లక్ష్మీనారాయణ, ఎస్.కోటేశ్వరరావు, ఎం.రాజారావు, దొడ్డి శ్రీను, ఎం.రామారావు ఉన్నారు.


ఎంపీని కలిసిన అధికారులు, నాయకులు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 17: కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను సోమవారం పలువురు అధికారులు, నాయకులు కలిశారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మీ, ఆర్డీవో ఈట్ల కిషోర్‌తోపాటు జనసేన కాకినాడ పార్లమెంటు ఎన్నికల కమిటీ సభ్యుడు డాక్టర్ మల్లాడి రాజేంద్రప్రసాద్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బస్వాని నాగబాబు, వరిపిల్లి ప్రసాద్, చింతపల్లి తాతారావు, గంపల సత్యానందం, సంగాని బాలమహేశ్వరరావు, వీరెల్లి ఏసు, మామిడికుదురు ప్రసాద్, పొట్టి పెద్దబాబు ఉన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూకు అభినందనలు

జగ్గంపేట, జూన్ 17: జగ్గంపేట ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూ అఖండ విజయం పట్ల ఆనందంతో టీడీపీ కార్యాలయంలో రావులమ్మ నగర్‌వాసులు శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. అలాగే జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్‌ను కలిసి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే అగర్వాల్ స్వీట్స్ అధినేత సత్యనారాయణ కుమార్తె అశ్వినిని అభినందించారు. కార్యక్రమంలో తోలేటి సూర్యనారాయణ, మంచాల మల్లేశ్వరరావు, చంద్రమౌళి, రాంబాబు, ఎల్ఐసీ రామచంద్రరాజు, పి.సోమరాజు, నాగరాజు, సీహెచ్ హరిబాబు, ఆదినారాయణమూర్తి, సత్యనారాయణ, సదాశివరావు, శ్రీనివాసరావు, దొర తదితరులు పాల్గొన్నారు.





పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన సీఎం చంద్రబాబును కలిసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

కొంగోడు వెంకన్న కల్యాణోత్సవం



కొంగోడులో కల్యాణ వేదికపై స్వామి,అమ్మవార్లు

కరప, జూన్ 17: కొంగోడు ఆలయంలో సోమవారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్ల దివ్య కల్యాణమహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును చేపట్టారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వంశపారంపర్య ధర్మకర్తలు డాక్టర్ సి.ఫణీంద్ర, డాక్టర్ సి.శ్రీధర్ దంపతులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ మేడిశెట్టి సుబ్బరాజు, మాజీ ఎంపీటీసీలు ఆట్ల గోవిందరాజులు, మేడిశెట్టి సత్తిరాజు, ఎం.వీరభద్రవెంకట్రావు, టి.సుబ్బారావు, నక్కా గోవిందు,వీఆర్వో మేడిశెట్టి కిషోర్ ఉన్నారు.

కరపలో శివపార్వతుల కల్యాణం

కరప శివాలయంలో సోమవారం రాత్రి పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణం వేడుకగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు డి.ఈశ్వరబాబు, శ్రీనివాస్, విలపర్తి ఫణిరాజు స్వామి,అమ్మవార్లకు విశేష పూజలు, కల్యాణం నిర్వహించారు. ఈవో కె.తిరుమలరవితేజ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవస్థానం సిబ్బంది చీర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీబీ దేవంలో వెంకన్న కల్యాణం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు

పెద్దాపురం, జూన్ 17: మండలంలోని సీబీ దేవం గ్రామంలో అలివేలు మంగా, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బర్రెడ్డి వెంకన్నబాబు, ఆలయ అర్చకుడు రామానుజాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో సత్యదేవుని కల్యాణం



ఏలేశ్వరంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం, జూన్ 17: ఏలేరు నదీతీరాన వేంచేసి ఉన్న శ్రీఅనంత లక్ష్మీసమేత సత్యనారాయణస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సోమవారం అన్నవరం దేవస్థానం వారి ఆధ్వర్యంలో అర్చకులు పొన్నూరి సత్యనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు వేధుల సూర్యనారాయణశర్మ, అమరేశ్వర అవధాని, పురోహితులు కంచిబొట్ల రామ్ కుమార్, ఇంద్రగంటి పవన్ కుమార్ రాత్రి 7గంటలకు దివ్య కల్యాణం జరిపించారు. కౌన్సిలర్ మూది నారాయణస్వామి, చౌదరి రాంబాబు, ప్రచార కర్త నల్లమిల్ల కృష్ణబాబు, పెద్ద ఎత్తున భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

అరుణాచలేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు, జూన్ 17: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దశపాప హరణ ఏకాదశి పురస్కరించుకుని అపీత కుంచాబ సమేత అరుణాచలేశ్వరునికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూల అలంకరణలు చేపట్టారు. ధర్మవరంలోని రాజరాజేశ్వరి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు సోమవారం రాత్రి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్ పునఃప్రారంభం



భోజనాలు వడ్డిస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, జూన్ 17: కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ప్రతి సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభమైంది. ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని వారాలు ఆగిన క్యాంటీన్‌ను సోమవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో పునఃప్రారంభించారు. జగ్గంపేట రుచి హోటల్స్ అధినేత నాగేంద్ర చౌదరి ఆర్థిక సాయంతో భోజనాలు ఏర్పాటు చేశారు. అన్న క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నదానం నిర్వహించిన జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను టీడీపీ హయాంలో చంద్రబాబు ఏర్పాటు చేశారని, కానీ వైసీపీ ప్రభుత్వం వీటిని రద్దు చేయగా మళ్లీ ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్న క్యాంటీన్లను పునుద్ధరించారని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం జగ్గంపేటలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసే వరకు దాతల సహకారంతో ప్రతి సోమవారం ఇక్కడ అన్నదానం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, రుచి హోటల్స్ అధినేత నాగేంద్ర చౌదరి, సత్తి సదాశివరెడ్డి, జాస్తి వసంత్, భూపాలపట్నం ప్రసాద్, దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, బద్ది సురేష్, యల్లమిల్లి సీఎం, కింగం రమణ, నేదురి గణేష్, తోలుగంటి ప్రవీణ్ రెడ్డి, రాయిసాయి, అరటా పోలీస్, కురుమళ్ల నాగేశ్వరరావు, దేగల సత్తిబాబు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలంటూ టీడీపీ ఆందోళన

ఏలేశ్వరం, జూన్ 17: మండలంలోని లింగంపర్తి పంచాయితీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న దుకాణాలను ఆపాలంటూ సోమవారం టీడీపీ నేతలు ఆందోళన చేపట్టారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి నేతృత్వంలో ఎర్రవరం వెళ్లే ప్రధాన రహదారిపై సుమారు 2గంటలపాటు టీడీపీ నాయకులు గొంతిన సురేష్, పర్వత సురేష్, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, రాయుడు చిన్న, నూకతాటి ఈశ్వరుడు, చాక్కాల లక్ష్మణరావు కార్యకర్తలు నిరసన తెలిపారు. పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి, సీఐ శేఖర్‌బాబు, ఎంపీడీవో అరుణ సంఘటనా దుకాణాలను పరిశీలించి కాం క్రీటు పనులు నిలిపివేశారు. టీడీపీ నాయకులతో మాట్లాడి భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడడంతో వెంటనే ఆందోళన విరమించుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలపై పూర్తిస్థాయిలో కలెక్టర్‌తో సంప్రదించి చర్యలు తీసుకుంటామని, విచారణ జరిపేంత వరకు నిర్మాణాలు చేపట్టకుండా పోలీసు సెక్యూరిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్టుగా టీడీపీ నాయకులు తెలిపారు. యండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, పెంటకోట శ్రీధర్, బెల్లాని శ్రీను, కోరుకొండ నూకరాజు, ప్రసాద్ ఉన్నారు.

రోడ్డంతా గుంతలే!



గుంతలు పడిన గోకవరం రోడ్డు

జగ్గంపేట, జూన్ 17: జగ్గంపేట మండలంలో గోకవరం రోడ్డు రెండేళ్ల నుంచి గుంతలతో అధ్వాన్నంగా మారింది. ఇప్పటికీ కనీసం మరమ్మతులు కూడా చేపట్టపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై తక్షణం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. నెహ్రూ కాలనీ దగ్గర నుంచి రాజుపూడి వరకు రోడ్డంతా కూడా గుంతలుగా ఉండి వర్షం వస్తే గోతుల్లో నీరు నిండి అనేక మంది వాహనదారులు ఆ గోతుల్లో పడిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆదివారం సాయంత్రం వర్షం రావడంతో ఈ రోడ్డున ఇద్దరు మోటార్‌సైకిల్‌పై వెళ్లే వాళ్లు గోతులో పడ్డారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

'రోడ్ల ఆధునికీకరణపై దృష్టి సారించాలి'

కరప, జూన్ 17: రోడ్ల ఆధునికీకరణపై ప్రభుత్వం దృష్టి సారించి ప్రమాదాలను నివారించాలని రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు విజ్ఞప్తి చేశారు. నడకుదురులో సోమవారం ఆయన మాట్లాడుతూ కాకినాడ-జొన్నాడ, కాకినాడ-సామర్లకోట రోడ్లలో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. గుంతలు, ఇరుకు రోడ్ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రభుత్వాలు మారుతున్నా ఈ రోడ్లు అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. ఈ రహదారుల విస్తరణ పనులను చేపట్టి రోడ్డు ప్రమాదాలను నిరోధించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే రాజప్ప ప్రత్యేక పూజలు



శృంగారవల్లభస్వామికి పూజలు చేస్తున్న రాజప్ప

పెద్దాపురం, జూన్ 17: మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు వారికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), మొయిళ్ల కృష్ణమూర్తి, బందిలి సుబ్రహ్మణ్యం, మత్తాల రాజు, మాజీ ఎంపీటీసీ గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్, దేవస్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బీసీ నేతలు

తాళ్లరేవు, జూన్ 17: మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టిన రోజు సందర్భంగా మాదవరాయుడుపేట ఎస్ఏఎఫ్ యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలను బీసీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పితాని హేమలత, సూరంపూడి కుమార్, శివాజీ ఉన్నారు.

హైవేపై బోల్తా కొట్టిన కంటైనర్



తొండంగి, జూన్ 17: బెండపూడి సమీపంలోని తమ్మయ్యపేట వద్ద ఆదివారం రాత్రి కంటైనర్ బోల్తా కొట్టింది. విశాఖ నుంచి రాజమండ్రి వైపుగా వెళ్తున్న కంటైనర్ అదుపుతప్పి బోల్తా కొట్టగా డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. హైవే సిబ్బంది ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా దానిని తొలగించారు.

మట్టి ట్రాక్టర్లు సీజ్

గొల్లప్రోలు రూరల్, జూన్ 16: అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి వద్ద పోలవరం గట్లు నుంచి మట్టి తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో వీఆర్వోలు సోమవారం తనిఖీలు నిర్వహించారు. 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో వీఆర్వో శేఖర్, బాబ్జి, చంటి తదితరులు ఉన్నారు.

22 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 17: ఈనెల 16 నుంచి 22 వరకు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వారి నిర్వహణలో ఎస్పీ ఆఫీసు పక్కన చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని జిల్లా చేనేత అధికారి కె.పెద్దిరాజు తెలిపారు. రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన చేనేత, పట్టు, వస్త్రాలు అందుబాటులో ఉంచుతారని చెప్పారు.